# నినాదం

నిఖార్సైన జర్నలిజం

ఆదివారం 23 ఫిబ్రవరి 2025 | తెలంగాణ ప్రాంతీయం | పేజీలు 8




### బిటి పిఎస్ భూ నిర్వాసిత గిరిజనులకు

# న్యాయం చేయండి

- గత ప్రభుత్వ హయాంలో నిర్వాసితుల సొమ్ము దోచుకున్న వారిపై కఠినచర్యలు తీసుకోండి
- గిరిజనులకు న్యాయం జరిగేంత వరకు ఉపేక్షించబోము
- ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేసిన చందా లింగయ్య దొర

**మణుగూరు, ఫిబ్రవరి 22( నినాదం న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం చిక్కుడు గుంట గ్రామం వద్ద నిర్మించిన, భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణంలో భూములు కోల్పోయిన గిరిజనులకు న్యాయం చేయాలని కోరుతూ గిరిజన సంఘం జాతీయ అధ్యక్షులు చందా లింగయ్య దొర రాష్ట్ర ప్రభుత్వ పెద్దలైన సీఎం రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు వినతిపత్రాన్ని సమర్పించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణంలో అనేక అవకతవకలు జరిగాయని వీటిపై పూర్తి విచారణ జరిపించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అన్యం పుణ్యం తెలియనిఅమాయక గిరిజనుల భూములను తీసుకొని వారికి చెల్లించాల్సిన నష్టపరిహారం 400 కోట్ల రూపాయలు వరకు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసి, అప్పటి ప్రభుత్వ పెద్దలు ఆ సొమ్మును స్వాహా చేయడం జరిగిందని

మిగతా2లో



మొక్కలు లేకుండా కనిపిస్తున్న కోదాడ పట్టణ ప్రకృతి వనం.

2లో

### ప్రకృతి వనాలపై..

# పట్టింపేది..!

- నిధులు లేక భారంగా మారిన నిర్వహణ
- కొనిచోట్ల ఎండిపోతున్న మొక్కలు...
- మరికొన్ని చోట్ల కబ్జాకు గురవుతున్న వనాలు
- ప్రకృతి వనాల నిర్వహణ మరిచిన అధికారులు

పల్లె, పట్టణ ప్రకృతి వనాలు కళావిహీనంగా మారుతున్నాయి.అధికారుల పర్యవేక్షణ, నిర్వహణ, నీటి సౌకర్యం కొరవడటంతో వనాల్లోని మొక్కలు ఎండిపోతున్నాయి. గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాలు పట్టించుకోకపోవటంతో కొన్నిచోట్ల బోర్డులు మాత్రమే మిగిలిపోయే పరిస్థితికి చేరుకున్నాయి.

– కోదాడ (నినాదం న్యూస్)



వివరాలు 2లో

### రేపు పదవ తరగతి విద్యార్థులకు..

# ప్రత్యేక శిక్షణ

మండల విద్యాధికారి మారపల్లి సునీతా రాణి

### మున్సిపల్ కార్మికుల

# సమస్యలు పరిష్కరించాలి

### సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్

**చేవెళ్ల, ఫిబ్రవరి22(నినాదం న్యూస్):** మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పట్టణ కేంద్రంలో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ కు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని గుర్తింపు కార్డులు, యూనిఫార్మ్, సబ్బులు, నూనెలు, గ్లౌజులు, షూస్ఈఎస్ఐ, పిఎఫ్, ప్రమాద బీమా తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేయగా, కమిషనర్ గారు మాట్లాడుతూ కార్మికులకు ఏ సమస్య ఉన్న పరిష్కారం చేస్తామని ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అన్ని వార్డుల కార్మికులు పాల్గొన్నారు.





## బిటి పిఎస్ భూ నిర్వాసిత గిరిజనులకు న్యాయం చేయండి

(మొదటి పేజీ తరువాయి..)

ఆయన విన్నతుపత్రంలో సమర్పించారు. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ పెద్దలు గిరిజన ఇతరులతో చేతులు కలిపి గిరిజనుల భూములను పట్టాదారు పాస్ పుస్తకాల్లో ఆర్ ఓ ఆర్ రిజిస్టర్లో గిరిజనులు పేర్లకు బదులుగా గిరిజనేతుల పేర్లు ఎక్కించి ఉద్యోగాలు కేటాయింపులో కూడా భారీగా ద్రోహం చేయడం జరిగిందని ఆయన వినతిపత్రం ద్వారా ఆరోపించారు. పవర్ ప్లాంట్ కి భూములు ఇచ్చింది గిరిజనులు అయితే ఉద్యోగాలు గిరిజనేతరులకు కేటాయించి గిరిజనులకు అన్యాయం చేయడం జరిగిందని ఆయన ఆరోపించారు. అప్పట్లో మణుగూరు పినపాక మండలంలో రెవెన్యూ భూ రికార్డులను అప్పటి ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పెద్దలు కుమ్మక్కై రికార్డులనే తారుమారు చేయడం జరిగిందని ఆయన ఆరోపించారు. పవర్ ప్లాంట్ కి భూములు ఇచ్చిన నిర్వాసిత గిరిజనుల కోసం అప్పటి రాష్ట్ర ప్రభుత్వము 400 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అయినా గిరిజనులకు ఒక్క రూపాయి ఇవ్వకుండా అన్యాయం చేస్తూ, గిరిజనేతరులతో చేతులు కలిపిన పాలకులు రెవిన్యూ అధికారుల ద్వారా తప్పుడు పేర్లను తప్పుడు రికార్డులను సృష్టించి గిరిజనేతరులకి ఉద్యోగాలు కేటాయించి గిరిజనులకు అన్యాయం చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అలాగే భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణంలో కూడా భారీ ఎత్తులో కుంభకోణం జరిగిందని దీనిపై కూడా పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని చందా లింగయ్య దొర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాసిరకమైన మెటల్ తో నిర్మించిన భద్రాద్రి పవర్ ప్లాంట్ లో, పొగ కాలుష్యము బూడిద లాంటి కాలుష్యాలు పెద్ద ఎత్తున వెదజల్లుతున్నాయని ఆయన పేర్కొన్నారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజలు ఈ కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు కూడా ఆయన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ విషయంపై కూడా రాష్ట్ర ప్రభుత్వము సమగ్ర దర్యాప్తు జరిపించి ఈ అక్రమాలకు కారుకులైన పెద్దలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై ఉపముఖ్యమంత్రి స్పందిస్తూ కచ్చితంగా గిరిజనులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని, అలాగే గిరిజనులకు అర్హతను బట్టి న్యాయం చేసేందుకు విచారణ కమిటీ వేస్తామని ఆయన ఆయన పేర్కొన్నారు. గిరిజనులకు న్యాయం జరిగేంత వరకు పోరాటాన్ని ఉపేక్షించబోమని దీర్ఘకాలిక పోరాటాలు కూడా చేసేందుకు వెనకాడ బోమని ఆయన రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు బాధిత గిరిజనలు తదితరులు పాల్గొన్నారు.

## రేపు పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 22 (నినాదం న్యూస్):** పదవ తరగతి విద్యార్థులు 10జిపిఎ సాధించేందకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు భీమదేవరపల్లి మండల విద్యాధికారి మారపల్లి సునీతారాణి అన్నారు. శనివారం మండలంలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించి వంటగది, వంట సామాగ్రిని పరిశీలించారు. పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఎస్సీఆర్ టీ సాట్ ద్వారా ప్రత్యేక శిక్షణ తరగతులు అందించారు. టీ సాట్ కార్యక్రమంలో నిపుణులు చెప్పిన అంశాలను నోటు పుస్తకాలలో రాసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యాధికారి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ములుకనూర్ మాడల్ స్కూల్లో మండలంలో గల ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతన్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో ఐదు మంది విద్యార్థులను ఎంపిక చేసి పరీక్షల్లో 10 జిపిఎ సాధించేందుకు నిపుణులచే మెలుకువలు, వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ప్రకృతి వనాలపై పట్టింపేది.!



అజ్మీర్ తండాలో కబ్జాకు గురైన పల్లె ప్రకృతి వనం.



మొక్కలు లేకుండా కనిపిస్తున్న కోదాడ పట్టణ ప్రకృతి వనం.

**కోదాడ, ఫిబ్రవరి 22 (నినాదం న్యూస్):** పల్లె, పట్టణ ప్రకృతి వనాలు కళావిహీనంగా మారుతున్నాయి.అధికారుల పర్యవేక్షణ, నిర్వహణ, నీటి సౌకర్యం కొరవడటంతో వనాల్లోని మొక్కలు ఎండిపోతున్నాయి. గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాలు పట్టించుకోకపోవటంతో కొన్నిచోట్ల బోర్డులు మాత్రమే మిగిలిపోయే పరిస్థితికి చేరుకున్నాయి. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు, పచ్చదనాన్ని పెంచేందుకు గత ప్రభుత్వం పల్లె ప్రగతిలో, పట్టణ ప్రగతిలో భాగంగా ఈ వనాలను ఏర్పాటు చేసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1740 అధికారులు ఏర్పాటు చేశారు. నల్లగొండ జిల్లాలో 844 సూర్యాపేటజిల్లాలోని 475, యాదాద్రి జిల్లాలో 421 పల్లె ప్రకృతి వనాలను, ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా 19 పురపాలక సంఘాల ఉండగా వాటి పరిధిలో 300కు పైగా పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు ఒక్కో వనాన్ని 10 కుంటల నుంచి అర ఎకరం విస్తీర్ణంలో ఏర్పాటు చేసి, మొక్కలు నాటారు. మేజర్ పంచాయతీల్లో బృహత్ ప్రకృతి వనాలు అందుబాటులోకి తెచ్చారు. అధికారులు ప్రకృతి వనాలు ఏర్పాటు ఆరంభంలో చూపిన శ్రద్ధ ఆ తర్వాత చూపడంలేదు. కొన్నిచోట్ల వనాల్లో పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగాయి. మరికొన్నిచోట్ల మొక్కలు ఎదుగూ బొదుగు లేకుండా పోయాయి. నీరు లేకపోవడంతో మొక్కలు పెరగడం లేదు..అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పురపాలక సంఘం సిబ్బంది, పంచాయతీ సిబ్బంది కూడా పట్టించుకోవడం లేదు. ఇప్పటికే చాలా వరకు మొక్కలు ఎండిపోయి కనిపిస్తున్నాయి. రానున్న వేసవిలో నీటి వసతి కల్పించకపోతే ప్రకృతి వనాలు కనుమరుగయ్యే అవకాశం ఉంది.

**అధికారుల పర్యవేక్షణ శూన్యం..**

ఉమ్మడి జిల్లాలో ప్రకృతి వనాల్లో సుమారు 25 లక్షల మొక్కలు నాటారు. నిర్వహణ తీరు బాగా ఉన్న చోట కనువిందు చేస్తున్నాయి. ప్రకృతి వనాలకి బోర్డు, గేటు, స్థలం చుట్టూ రాతి స్తంభాలతో ఫెన్సింగ్, విద్యుత్, బోరు, మొక్కలు ఇలా అన్ని ఏర్పాట్లకు భారీగానే ఖర్చయింది. నిర్వహణ లేకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. కొన్ని వనాల్లో కనీసం బోరు కూడా లేదు. ట్యాంకర్లతో ఎప్పుడో ఒకసారి నీళ్లు పోస్తుండటంతో అవి వాడిపోతున్నాయి. స్థలం చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ స్తంభాలు, విలువైన తీగ, గేట్లను గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోతున్నారు. అధికారులు కూడా ఈ పల్లె ప్రకృతి వనాల వైపు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని, మరికొన్ని చోట్ల పల్లె ప్రకృతి వనాలు తాగుబోతులకు అడ్డాగా మారాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా చుట్టూ జాలి, గేటు వసతులు కల్పించి ప్రకృతి వనాలను పరిరక్షించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

**కబ్జాకు గురైన పల్లె ప్రకృతి వనం...?**

పల్లె ప్రకృతి వనంలో గోంగూర తోట ప్రకృతి వనంలో పల్లెవాసులు సేదతీరిందుకు ద్రోహదపడతాయని ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేసింది. కానీ కొన్నిచోట్ల ప్రజలకు ఉపయోగపడుతున్న పల్లె ప్రకృతి వనాలు, మరికొన్నిచోట్ల కబ్జాకు గురవుతున్నాయి. వివరాల్లోకెళితే... అనంతగిరి మండలం ఖానాపురం ఆవాస గ్రామమైన అజ్మీర్ తండా గ్రామంలో ఏర్పాటుచేసిన పల్లె ప్రకృతి వనం కబ్జాకు గురైందని గ్రామస్తులు, గిరిజనులు ఆరోపిస్తున్నారు. రెండు లక్షల రూపాయల ప్రకృతి వనంలో చుట్టూ ఫెన్సింగ్ వేసిన ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఉన్న చెట్లను తొలగించి ఒక కజ్జా దారుడు గోంగూర తోట వేయటం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఇదిలా ఉండగా గత ప్రభుత్వంలో పల్లె ప్రకృతవనం ఏర్పాటు చేసే సమయంలోనే కొంత గజిబిజి ఏర్పడింది. అప్పుడే రైతు ఈ భూమి నాది అంటూ అధికారులతో ప్రజా ప్రతినిధులతో మొరపెట్టుకున్నారు. గడువులోపు పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో త్వరగా పని పూర్తి చేయాలని అప్పటి ప్రజాప్రతినిధులు రైతుకి వేరే చోట భూమిని ఇప్పిస్తామని ఈ భూమికి అడ్డు రావద్దంటూ చెప్పడంతో సదరు రైతు ఒప్పుకున్న నేపథ్యంలోనే అక్కడ పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారని కానీ ఇచ్చిన మాట ప్రకారం రైతుకు భూమి ఇవ్వకపోవడంతో పల్లె ప్రకృతి వనం ఆక్రమించి పంట పండిస్తున్నారు అంటూ రైతు తరుపు బంధువుల పేర్కొంటున్నారు. అప్పుడే అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసిన తర్వాతే పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసి ఉంటే బాగుండేదని ప్రజల నుండి అభిప్రాయాలు వెలవడుతున్నాయి. ఇదే విషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి అక్షయ తేజ నినాదంతో మాట్లాడుతూ... కబ్జా విషయమై సదరు రైతుకు నోటీసుల సైతం జారీ చేశామని తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లామని త్వరలోనే అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

# చెరువుల ఆక్రమణలను వెంటనే తొలగించాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా.శ్రీకాంత్, డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ డిమాండ్
- సిపిఎం ఆధ్వర్యంలో ఖమ్మం ఆర్.డి.ఓకు వినతి




**ఖమ్మం,ఫిబ్రవరి 22(నినాదం న్యూస్):** ఖమ్మం నియోజకవర్గం ప్రధానంగా ఖమ్మం నగరంలో లకారం, ధంసలాపురం,ఖనపురం, వెలుగుమట్ల, మల్లెమడుగు చెరువుల ఆక్రమణలను తక్షణమే తొలగించి యఫ్. డి. యల్ బఫర్ జొన్లను నిర్ధరించాలని,అలాగే ఆక్రమించిన సంస్థల, వ్యక్తుల నిర్మాణాలను,కార్యకలాపాలను, తప్పుడు పాస్ పుస్తకలను తక్షణమే నిరోధించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా.శ్రీకాంత్, డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ లు డిమాండ్ చేశారు. స్థానిక ఖమ్మం రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆర్.డి.ఓ కి నరసింహారావు గారికి విన్నతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మంలో అనేక సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్న చెరువులను కాపాడటంలో పాలకులు విఫలం చెందుతున్నారని,అనేక చెరువులను ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించి నిర్మాణాలను చెప్పటారని ఫలితంగా చెరువుల విస్తీర్ణం తగ్గిపోతునాయన్ని వారు ఆవేదన వ్యక్తం చేశారు.వర్ష కాలంలో వర్షాలు,వరదలు వచ్చినప్పుడు తీవ్రమైన ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరుగుతుందని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు అన్నారు.అలాగే జి.ఓ నెం 58,59 లను అడ్డుపెట్టుకొని ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులు,సంస్థలు ఆక్రమించిన మీరు నిర్ధారించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొవలని వారు కోరారు.అలాగే మున్నేరు కరకట్ట నిర్మాణంలో ఇళ్లు,భూములు కోల్పోతున్న వారికి ఆర్.ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలపై స్పందించిన ఆర్.డి.ఓ గారు మాట్లాడుతూ చెరువుల ఆక్రమణలపై చర్యలు నడుస్తున్నాయని,త్వరలోనే యఫ్.టీ.యల్ బఫర్ జోన్లను నిర్ధారించి ప్రజా ఉపయోగ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యం.ఏ.జబ్బార్, యస్. కే. మీరాసాహెబ్,ఖానాపురం హవేలీ కార్యదర్శి దొంగల.తిరుపతిరావు,త్రి టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీను,రఘునాథపాలెం మండల కార్యదర్శి యస్.నవీన్ రెడ్డి, వన్ టౌన్ కార్యదర్శి షేక్. నాగుల్ మీరా నాయకులు పడిగల.నాగేశ్వరరావు,కుసుపూడి.మధు,తిపర్తి.వినోద్ గుమ్మడి.భిక్షం తదితరులు పాల్గొన్నారు.

# నీటి కష్టాలు తెలవని రాజకీయ నాయకులు

- **కేవలం ఓటర్ల కోసమే నిరుపేదలకు అండగా ఉంటాం**
- **నిత్యం రాజకీయ నాయకులు బడా పత్రికల కేవలం యాడ్ కోసమే ప్రింటింగ్ లు**
- **నిరుపేద సమస్యవస్తే పత్రిక ఎడిటర్లు పక్కనే పెడతారు సమస్యను**
- **ప్రజా ప్రతినిధులు యాడ్ రూపంలోనే రాజకీయ నాయకులు కంటే దుర్వోనియోగం బడా పత్రికలు**
- **నీటి కోసం నిత్యం తిప్పలు**
- **సింగరేణిలో 30 ఏళ్లుగా వాటర్ ట్యాంకర్లపైనే ఆధారం్న పనులు మానుకొని ఎదురు చూపులు**



**మహేశ్వరం, ఫిబ్రవరి 22 (నినాదం న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలోని పేరు ప్రఖ్యాతిగాంచిన హైదరాబాద్ మహానగరంలోనే అతి పెద్ద మురికివాడల్లో ఒకటైన సింగరేణి కాలనీ ఒకటి. ఇక్కడి గుడిసెవాసులు తాగునీటి కోసం నిత్యం అష్టకష్టాలు పడుతున్నారు. ఐఎస్ సదన్ డివి జన్ పరిధిలోని ఈ మురికివాడలో బడుగు, బలహీన వర్గాల వారే అధికం. పలు జిల్లాల నుంచి బతుకు దెరువు కోసం నగరానికి వలస వచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. పది హేను వేలకు పైగా కుటుంబాలు నివసించే సింగరేణి కాలనీలో అత్యధిక మంది నిత్యం పని చేసుకుంటేనే పూట గడుస్తుంది. అంతటి క్లిష్ట పరిస్థితుల్లోనూ చాలా సందర్భాల్లో పనులు మానుకొని వాటర్ ట్యాంకర్ల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. నీటి కోసం పనులు మానుకొన్న రోజున పస్తులు ఉం డాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కుటుంబాల్లోని పిల్లలు పాఠశాలకు వెళ్లటం మానేసి తాగునీరు పట్టుకోవడానికి ఇంటి వద్దనే ఉండిపోతున్నారు.

**30 ఏళ్లుగా ట్యాంకర్లపైనే ఆధారం...**

వివిధ జిల్లాల నుంచి వలస వచ్చిన వారు 30 సం వత్సరాలుగా ఇక్కడి ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. అప్పటి నుండి ఇప్పటికీ వాటర్ ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు, చిన్నారులు వారు వాటర్ వర్క్స్ విభాగం వారు సరఫరా చేసే వాటర్ ట్యాంకర్లపైనే తాగునీటి కోసం ఆధార పడుతున్నారు. రోజు విడిచి రోజు చొప్పున వచ్చే ట్యాంకర్లే వారి అన్ని అవసరాలకు దిక్కు. సిం గరేణి కాలనీలోని గుడిసె వాసుల కోసం 13 ట్యాం కర్లు నిత్యం సుమారు 100 ట్రిప్పులు నడుపుతు న్నారు. ముఖ్యంగా వేసవికాలంలో ఏ ట్యాంకర్ డ్రైవర్ అయినా విధులకు రాక పోతే ఆ రోజుకు ఆ ట్యాంకర్ ట్రిప్పులు నడపడం లేదు. దాంతో ఆ ట్యాంకర్ కోసం రోజంతా ఎదురు చూస్తూ పలువురు గుడిసెవాసులు ఇబ్బందులు పడుతు న్నారు. సదరు ట్యాంకర్ యజమాని కానీ, అధి కారులు కానీ ఈ విషయంలో ఎలాంటి ప్రత్యా మ్నాయ చర్యలు తీసుకోక పోవడం వల్ల గుడిసె వాసులకు కష్టాలు తప్పటం లేదు. గత ప్రభుత్వాల హయాంలోనే బస్తీలు, మురికివాడ లలోని ప్రజల ఇళ్లకు ఒక్క రూపాయికి వాటర్ కనె క్షన్ పథకం అమలు చేశారు. కానీ ఆ పథకాన్ని సింగరేణి కాలనీలో అమలు చేయడానికి అధికారులు తాత్సారం చేస్తున్నారు..

**శాశ్వత పరిష్కారం చూపాలి**

**-షేక్ మహమూద్, ఐఎస్సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి**



నిరుపేదలు అత్యధికంగా నివసించే సింగరేణి కాల నీలో కనీస మౌలిక వసతులు కల్పించడంలో అధి కారులు విఫలం అవుతున్నారు. ఇంటింటికి మంచి నీటి కనెక్షన్ ఏర్పాటు చేస్తేనే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం అభిస్తుంది. అందుకోసం గుడిసెవాసులతో కలిసి పోరాటం చేస్తాం. పై అందుకే పత్రిక ఎడిటర్లు కంటే సోషల్ మీడియా న్యాయమని కేవలం పత్రిక బడబాబులు రాజకీయ నాయకులు పత్రిక ఎడిటర్లు రిపోర్టర్లు సమస్యను పత్రిక రూపంలో చూపెట్టారు.

సింగరేణి కాలనీలో నీటి నిల్వ కోసం డ్రమ్ములు ఏర్పాటు చేసుకున్న గుడిసెవాసులు

# కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కార్పొరేట్ల బడ్జెట్

- **పేదవాళ్లను కొట్టి బడా పారిశ్రామికవేత్తలకు పెడుతున్న నరేంద్ర మోడీ**
- **సిపిఐ జిల్లా కార్యదర్శి. పాలమాకుల జంగయ్య**




**మహేశ్వరం, ఫిబ్రవరి22 (నినాదం న్యూస్) :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ల కోసం తప్ప కార్మికులకు కష్టజీవులకు ఉపయోగపడే బడ్జెట్ కాదని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య విమర్శ శనివారం నాడు తుక్కుగూడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక బడ్జెట్ వ్యవసాయ రంగానికి మొండి చేయి చూపిందని వృత్తిదారులను దళిత గిరిజన శ్రామిక వర్గానికి మొండి చేయి చూపిందని గతంలో ఏనాడూ లేని విధంగా కార్పొరేట్లకు దేశ సంపదను దోచి పెట్టే విధంగా ఈ బడ్జెట్ ఉందని ఆయన మండిపడ్డారు సిపిఐ 100 సంవత్సరాలు శతాబ్ది ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని ఈ కార్యక్రమాలలో పార్టీ శ్రేణులు కార్యకర్తలు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు అవుతున్న ఏనాడు అధికారంలో లేకపోయినా పదవులు రాకపోయినా నమ్మిన సిద్ధాంతం కోసం ఎత్తిన ఎర్రజెండా వదలకుండా వందేళ్లుగా కష్టపడుతున్న కమ్యూనిస్టు యోధులకు నాయకులకు శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఘనంగా వారిని సన్మానం చేయాలని ఆయన కోరారు దోపిడి వర్గాల కోటలను బద్దలు కొట్టే విధంగా కమ్యూనిస్టుల పోరాటాలు ఉండాలని కార్మిక రాజ్య స్థాపన కోసం ప్రతి కష్టజీవి ఎర్రజెండా చేతబట్టి పోరాటం నిర్వహించాలని ఆయన అన్నారు ఎర్రజెండా లేకపోతే దోపిడిదారులు దగా కోరులు కార్పొరేట్ సంస్థలు పేదలను మరింత పీడించి దోచుకునేవారని ఎర్రజెండా వచ్చిన తర్వాత దోపిడీ కొంత మేరకు అడ్డుకోగలిగామని అయినా వారి దోపిడీకి అంతే లేకుండా పోయిందని ఆయన అన్నారు సిపిఐ 100 సంవత్సరాల శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని తుక్కుగూడలో జిల్లాస్థాయి సెమినార్ మార్చి 11న నిర్వహిస్తున్నామని ఈ సెమినార్ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గారు ప్రొఫెసర్ హరగోపాల్ ప్రముఖ జర్నలిస్టు విశ్లేషకుడు పాశం యాదగిరి గారు పాల్గొంటారని ఆయన తెలిపారు

విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు పాల్గొని మాట్లాడారు ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు సిపిఐ మహేశ్వరం నియోజకవర్గ కార్యదర్శి బి.దత్తు నాయక్ బాలాపూర్ మండల కార్యదర్శి ఎం.చంద్రశేఖర్ రెడ్డి , కందుకూరు మండల కె. రాజు.మండల నాయకులు దేవేందర్ గౌడ్ ,.బ్రహ్మాచారి , ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్టుల నిరసనను విజయవంతం చేయండి



**కరీంనగర్, ఫిబ్రవరి 22(నినాదం న్యూస్) :** జర్నలిస్టుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్( టిడబ్ల్యూజెఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టాలని రాష్ట్ర కమిటీ పిలుపు ఇచ్చిందన్నారు. దాంట్లో భాగంగా ఈ నెల 24న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ పథకం ప్రవేశపెట్టాలన్నారు. దాడుల నివారణ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాలన్నారు. మహిళ జర్నలిస్టులకు రాత్రి పూట ప్రత్యేక రవాణా సదుపాయాం కల్పించాలన్నారు. అదేవిధంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు ఇచ్చిన నివేషణ స్థలాల సమస్యలను వెంటనే పరిష్కరించి అందులో నిర్మాణాల కోసం అనుమతులు ఇవ్వాలన్నారు. హుజురాబాద్ లో ఇచ్చిన స్థలాలపై వేసిన కోర్టు కేసును ఉపసంహరింపజేసి ఇళ్ల నిర్మాణానికి అనుమతి పత్రాలు అందించాలన్నారు. పలు సమస్యలపై చేపట్టే నిరసన కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# టఫ్ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డు ఉద్యమం

- **ఉద్యమకారుల పోరాట త్యాగాల ఫలితమే రాష్ట్ర ఏర్పాటు**
- **టఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి**

**జమ్మికుంట ఫిబ్రవరి 22(నినాదం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమకారులు చేసిన పోరాటాలు త్యాగాల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిందని టఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎక్కేటి సంజీవరెడ్డి అన్నారు.తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ కార్యాలయం వద్ద పోస్ట్ కార్డు ఉద్యమ కార్యక్రమాన్ని చేపట్టారు.

ముఖ్యమంత్రి కి ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలని 100 పోస్ట్ కార్డులు పంపారు.

ఈ సందర్భంగా టఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎక్కటి సంజీవరెడ్డి మాట్లాడుతూ%ౌ% కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఉద్యమాలకు స్థానం కల్పించి గౌరవించిందని, ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే అమలు చేసే విధంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. అలాంటి ఉద్యమ కారులను గత ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని, ఈ కా కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించిందని, ఉద్యమకారులకు ప్రభుత్వంపై నమ్మకం ఉందని వెంటనే హామీలను అమలు చేయాలని కోరారు. ఒక కమిటీ ఏర్పాటు చేసి ఉద్యమకారులను గుర్తించి, 25 వేల పెన్షన్, 250 గజాల ఇంటి స్థలం, గుర్తింపు కార్డులు, ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసిన ఉద్యమకారుల ఆకాంక్షను నెరవేర్చవలసిన అవసరం ఉన్నదని పోస్టుకార్డు ఉద్యమం ద్వారా గుర్తు చేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో టఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎక్కేటి సంజీవరెడ్డి, రాష్ట్ర యువజన విభాగం కో కన్వీనర్ అన్నం ప్రవీణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మూడెడ్ల కుమారస్వామి, మండల అధ్యక్షులు రావుల రాజబాబు, నాయకులు ఆరే



రమేష్ రెడ్డి, టఫ్ నాయకులు పెద్ది కుమార్, వీరారెడ్డి, రాజిరు, సమ్మయ్య, రాజేందర్, రాజయ్య,వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్, భిక్షపతి, శివ, దిలీప్, సుమన్, అజయ్, శ్రీకాంత్, రాజు, గణేష్, టఫ్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజ్యలక్ష్మి మృతి బాధాకరం

**- కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిళి రమేష్**



**జమ్మికుంట, ఫిబ్రవరి 22 (నినాదం న్యూస్) :** నినాదం దినపత్రిక హుజురాబాద్ ఆర్సి ఇంచార్జ్ అయిత రాధాకృష్ణ మాతృమూర్తి అయిత రాజ్యలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం ఆమె దశదిన కర్మకు హాజరై ఘన నివాళులు అర్పించిన కరీంనగర్ జిల్లా కేడిసిసి బ్యాంక్ వైస్ చైర్మన్ పింగళి రమేష్. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, అయిత రాజ్యలక్ష్మి మృతి బాధాకరమని ఆ కుటుంబానికి భగవంతుడు అండగా నిలవాలని ఆ దేవుడిని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను ఆయన తెలిపారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగుల సంఘం గ్రూప్ సి రాష్ట్ర అధ్యక్షులు యు మహేందర్ మంచాల రాంబాబు కొండ్ల నాగేష్ ముంజల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి ముఠా అరెస్ట్

**- రెండున్నర లక్షల గంజాయి పట్టివేత**

**మదనపల్లె, ఫిబ్రవరి22 (నినాదం న్యూస్) :** గంజాయి ముఠాను శనివారం రెండవ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.2.5 లక్షల విలువ చేసే 20 కిలోల గంజాయిని పట్టుకున్నారు. స్థానిక రెండో పట్టణ పోలీస్గ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా డిఎస్పీ కొండయ్యనాయుడు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుకు వచ్చిన పక్కా సమాచారం మేరకు క్రైమ్ సీఐ చంద్రశేఖర్, రెండో పట్టణ సీఐ రామచంద్ర, రూరల్ సిఐ సత్యనారాయణ, క్రైమ్ సిబ్బంది తదితరులు గంజాయి సరఫరా రథారులపై డేగ కన్ను వేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో మదనపల్లి పట్టణం చంద్రా కాలనీకి చెందిన భాగ్యమ్మ (31), ఆవుల శివమ్మ (24), ఆవుల అనిల్ (27)లు గంజాయి విక్రయిస్తూ పట్టుపడ్డారన్నారు. వీరి వద్ద నుంచి రూ.2.5 లక్షలు విలువ గల 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. పలమనేరు, పుంగనూరు, పిటిఎం పోలీస్ స్టేషన్లో భాగ్యమ్మ పై గతంలో మూడు గంజాయి కేసులు కూడా నమోదయ్యాయని డీఎస్పీ తెలిపారు. వైజాగ్ నుంచి గంజాయిని తీసుకొస్తున్నట్లు నిందితులు తెలిపారన్నారు వీరిపై పీడీ యాక్టు నమోదు చేసేందుకు ఎస్పీకి సిఫారసు చెరస్తామని తెలిపారు. మదనపల్లె నియోజకవర్గం లో ఎక్కడ్కైనా గంజాయి విక్రయాల జరుగుతుంటే తమకు సమాచారం అందించాలని, గంజాయిని నియంత్రించేందుకు పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మదనప్లలె పట్టణ, పరిసర ప్రాంతాల్లో కొంతమంది యువత గంజాయికి బానిసలు అయ్యారని అన్నారు. గంజాయి సేవించినట్లు మాకు తెలిస్తే వారిని స్టేషన్ కు తీసుకొచ్చి వాసన పట్టి కూడా వారిపై బ్కెండోవర్ చేసుకుని అవసరమైతే కేసు నమోదు చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరు గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

# లిఫ్ట్‌లో ఇరుక్కుని చికిత్స పొందుతున్న బాలుడు మృతి

**- కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నినాదం న్యూస్) :** ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్ లిఫ్టులో ఇరుక్కుపోయిన బాలుడు మృతి చెందాడు. శుక్రవారం అపార్ట్‌మెంట్ లిఫ్టుకి, గోడకి మధ్య ఇరుక్కుపోయి.. రెండున్నర గంటలపాటు నరకయాతన అనుభవించిన ఆరేళ్ల బాలుడిని బయటకు తీసి నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ప్రాణాలు కోల్పోయాడు. ఆగాపుర గోడేకిఖబర్ ప్రాంతానికి చెందిన అజయ్‌కుమార్ కుమారుడు అర్ణవ్(6).. శుక్రవారం మధ్యాహ్నం తాతతో కలిసి రెడ్‌హిల్స్ శాంతినగర్ పార్కు ఎదురుగా ఉన్న మఫర్ కంఫర్ట్ అపార్ట్‌మెంట్ 3వ అంతస్తులో నివసిస్తున్న మేనత్త వద్దకు వెళ్లాడు. తాత చేతిలో లగేజీ ఉండటంతో బాలుడు చొరవ తీసుకుని లిఫ్టు గ్రిల్స్ తెరిచి ముందుగా లోపలికి వెళ్లాడు. తాత లగేజీ పెట్టేలోపే లిఫ్టు ఒక్కసారిగా పైకి వెళుతుండటంతో భయంతో బయటికి వచ్చేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. ఈ క్రమంలో లిఫ్టుకు, గోడకు మధ్యలో బాలుడు ఇరుక్కుపోగా..కదిలే వీల్లేని పరిస్థితుల్లో గ్రౌండ్ ఫ్లోర్‌కు, మొదటి అంతస్తుకు మధ్య లిఫ్టు ఆగిపోయింది. అర్ణవ్ హాహాకారాలు, మనవడిని రక్షించండంటూ తాత వేసిన కేకలతో అపార్ట్‌మెంట్‌వాసులు అప్రమత్తమయ్యారు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి పోలీసులకు సమాచారం అందించారు. నాంపల్లి ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ హుటాహుటిన అక్కడికి చేరుకోవడంతోపాటు డీఆర్ఎఫ్, అగ్నిమాపక బృందాలను, 108 అంబులెన్స్‌ను రప్పించి సహాయక చర్యలు చేపట్టారు. తొలుత గ్యాస్‌కటర్‌తో లిఫ్టు గ్రిల్స్‌ను తొలగించే ప్రయత్నం చేసినా.. బాలుడి క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చివరికి లిఫ్టు గోడలను బద్దలుకొట్టారు. దాదాపు 90 నిమిషాలు శ్రమించి అతికష్టమ్మీద బాలుడిని బయటికి తీశారు. నడుము, కడుపు భాగానికి తీవ్ర గాయాల్కె.. అపస్మారకస్థితికి చేరిన బాలుడికి 108 వైద్య బృందం ఆక్సిజన్ అందించి..అనంతరం నిలోఫర్ ఆసుపత్రికి తరలించింది. ఐసీయూలో చికిత్స పొందుతూ బాలుడు శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. బాలుడిని బతికించేందుకు తీవ్రంగా శ్రమించినట్లు వైద్య బృందం తెలిపింది. మధ్యాహ్నం 12.30 గంటలకు బాలుడు మృతి చెందినట్లు వెల్లడిరచింది. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. రోదనలు మిన్నంటాయి. అపార్ట్‌మెంట్ వాసులు తీవ్రం కలత చెందారు.

## నిజామాబాద్ పసుపు యార్డు సందర్శన

**- రైతులు దారుణంగా మోసపోతున్నారు : కవిత**

**నిజామాబాద్, ఫిబ్రవరి22 (నినాదం న్యూస్) :**నిజామాబాద్ పసుపు యార్డు ఎమ్మెల్సీ కవిత సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. నిజామాబాద్ పసుపు యార్డులో.. రైతులు దారుణంగా మోసపోతున్నారని, వారం రోజులుగా ధరలు పడిపోయాయన్నారు. కేంద్రం 15 వేలు మద్దతు ధర ఇస్తామని గొప్పలు చెప్పి రైతులను మోసం చేశారని, పసుపు బోర్డు కు చట్ట బద్ధత లేదన్నారు ఎమ్మెల్సీ కవిత. పార్లమెంట్ లో బిల్లు పెట్టీ .. బిల్లు పాస్ చేస్తే రైతులకు మేలు జరుగుతుందని, పసుపు మార్కెట్ లో రైతులను బ్లాక్ మెయిల్ చేసే పరిస్థితి అని ఆమె మండిపడ్డారు. ప్రభుత్వం పట్టించుకోక పోవడం వల్లే ఈ పరిస్థితి అని, పసుపు కు 12 వేలు ఇస్తామని గతంలో సీఎం రేవంత్ చెప్పారన్నారు. పసుపు రైతులకు బోనస్ ఇవ్వాలని, కేంద్రం పై పసుపు 15 వేలు ధర ఇవ్వాలని పోరాటం ఉంటుందన్నారు. పసుపు బోర్డుకు చట్ట బద్ధత కల్పించాలని బీఆర్ఎస్ తరపున పోరాటం చేస్తామన్నారు ఎమ్మెల్సీ కవిత.

## సొరంగ ప్రమాదానికి బాధ్యత రేవంత్‌దే

**- రక్షణ చర్యలు లేకుండా పనులు చేపట్టారు**

**- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్**

**- ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమన్న హరీష్ రావు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నినాదం న్యూస్) :** ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద జరిగిన ప్రమాదానికి పూర్తి బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. సుంకిశాలలో రీట్కెనింగ్ వాల్ కుప్పకూలిన ఘటన మరువకముందే రాష్ట్రంలో మరో దుర్ఘటన జరగడం కాంగ్రెస్ సర్కారు వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. గుత్తేదార్లతో కుమ్మక్కై, కవిరీషన్ల వేటలో పర్యవేక్షణ గాలికి వదిలేయడం, నాణ్యతా ప్రమాణాల విషయంలో పూర్తిగా రాజీపడటం వల్లే ఇలాంటి ఘటనలు జరుగు తున్నాయని ఆరోపించారు. చిక్కుకుపోయిన కార్మికులను క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల మేరకు పనులు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఒక బ్యారేజీలో కేవలం పిల్లర్ కుంగితే నానా హంగామా చేసిన కాంగ్రెస్ నేతలు.. వారి హయాంలో జరుగుతున్న వరుస వైఫల్యాలపై ఏమంటారని ప్రశ్నించారు. సుంకిశాల ప్రమాదంలో గుత్తేదారును కాపాడేందుకు వాస్తవాలు దాచి పెట్టిన ప్రభుత్వం.. కనీసం ఎస్ఎల్‌బీసీ ఘటనలో పారదర్శకంగా దర్యాప్తు జరిపి ప్రమాదానికి గల కారణాలను బయటపెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేపడుతున్న ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడం కాంగ్రెస్ సర్కార్ అసమర్థతకు, చేతగాని తనానికి నిదర్శనం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. చేయక చేయక ఒక ప్రాజెక్టు పనులు మొదలుపెట్టి ఆరంభంలోనే అంతం చేసిన ఘనత కాంగ్రెస్ పాలకులదే అని విమర్శించారు. మొన్న సుంకిశాలలో రీట్కెనింగ్ వాల్ కూలిన ఘటన, నేడు ఎస్ఎల్‌బీసీ సొరంగం కుప్ప కూలడం కాంగ్రెస్ కమిషన్ సర్కారు వైఫల్యానికి నిదర్శనం అని హరీశ్‌రావు విమర్శించారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే. గత నాలుగు రోజులుగా కొద్దికొద్దిగా మట్టి కూలుతున్నదనీ గుర్తించినప్పటికి ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం రేవంత్ సర్కార్ నిర్లక్ష్యమేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు తీవ్రంగా గాయపడగా, మరికొంత మంది కార్మికులు లోపల ఉన్నట్లు తెలుస్తుంది. వారిని క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలి. ఈ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి వారి ప్రాణాలు కాపాడాలి. డీ వాటరింగ్ చేసి, వెంటనే విద్యుత్ పునరుద్ధరించి, శిథిలాలను తొలగించి కార్మికులను వెంటనే బయటకు తీసుకురావాలి. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ వెంటనే ఈ ఘటనపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేయాలి





**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి22(నినాదం న్యూస్):** ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు అన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం పోలీసు అధికారులతో నిర్వహించిన నెలవారి నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. అవసరమైతే సంబంధిత న్యాయమూర్తులను స్వయంగా కలిసి కేసుల పరిష్కారానికి మరింత చొరవ చూపాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసుల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, కొత్త కేసులతో పాటు చాలా కాలంగా పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా కేసుల సంఖ్య తగ్గించే దిశగా అన్ని స్థాయిల అధికారులు పని చేయాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాలలో సిసిటీవి ల ప్రాముఖ్యత పై అవగాహన కల్పిస్తూ ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. అదే విధంగా మహిళల భద్రతకు మరింత భరోసా కల్పిస్తూ వారి రక్షణ ప్రధాన ధ్యేయంగా నాణ్యమైన, సత్వర సేవలు అందించాలన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దొంగతనాలు జరగకుండా పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి ఫిర్యాదులను స్వీకరించి జవాబుదారీగా ఉండాలని తెలియజేశారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతీ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించాలని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలు గంజాయి, జూదం, పి.డి.యస్ బియ్యం రవాణా, అక్రమ పశువుల రవాణా లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రిపీటెడ్ గా ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై పిడి యాక్ట్ ను నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 27న నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్క పోలీస్ అధికారి మరియు సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఆర్.ప్రభాకర రావు, ఆసిఫాబాద్ ఎ.ఎస్.పి చిత్తరంజన్, డీఎస్పీలు కరుణాకర్, రామానుజం, జిల్లాలోని సీఐలు, ఆర్.ఐ లు, ఎస్సైలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కారులో మంటలు... పూర్తిగా దగ్ధం




**కోదాడ/మునగాల, ఫిబ్రవరి 22 (నినాదం న్యూస్):** మునగాల మండలం ఆకపాముల వద్ద 65 నెంబర్ జాతీయ రహదారిపై తెల్లవారు జామున ఓ కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బాపట్ల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో కారులో ఇద్దరు వ్యక్తులు ఉండగా మంటలు గమనించి కారు నుంచి బయటికి దిగారు. హైదరాబాద్ కు చెందిన యుగంధర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డిలు బాపట్లలోని బంధువుల ఇళ్లకు వెళ్లి తిరుగు ప్రయాణంలో తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు అక్కడి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## రైతు సొమ్ము దొంగిలించిన

# ముగ్గురు నిందితులు రిమాండ్

**-కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించిన రూరల్ సీఐ రజిత రెడ్డి**



**కోదాడ, ఫిబ్రవరి 22(నినాదం న్యూస్):** రైతు సొమ్మును దొంగలించిన ముగ్గురు నిందితులను పోలీసులు పట్టుకుని రిమాండ్ కు తరలించారు. కోదాడ రూరల్ సిఐ రజిత రెడ్డి శనివారం పట్టణంలో తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈనెల 18వ తారీఖున అనంతగిరి మండలం గొండ్రియాల గ్రామానికి చెందిన రైతు కొండ బాల పుల్లయ్య ఖమ్మం జిల్లా నేలకొండపల్లి వెళ్లి తాను అమ్మిన వరి ధాన్యం సంబంధించి డబ్బులను తీసుకొని తన ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామ శివారులో వద్దకు వచ్చేసరికి తన వెనకనే ఒక స్కూటీపై ముగ్గురు వ్యక్తులు వచ్చి పుల్లయ్యను కొట్టి కింద పడేసి అతని వద్ద ఉన్న డబ్బులను లాక్కొని పారిపోయారు. ఈ విషయమై రైతు పుల్లయ్య ఫిర్యాదు మేరకు అనంతగిరి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ చేయవలసిందిగా సంబంధిత ఎస్సై నవీన్ కుమార్ కు ఆదేశాలు జారీ చేయడంతో ఎస్సై తన సిబ్బంది వీరబాబు ఏడుకొండలు, నరసింహులు తో కలిసి చాకచక్యంగా ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన ఉపతల అశోక్ కుమార్ ,షేక్ నవాబ్, షరీఫ్ దేవల్లా రాజా ముగ్గురు నిందితులను సిసి ఫుటేజ్ ఆధారంగా పట్టుకొని వారి వద్ద నుండి నగదు లక్ష 70 వేల రూపాయలు ద్విచక్ర వాహనం రెండు సెల్ ఫోన్ ను స్వాధీన పరుచుకున్నట్లుగా సీఐ తెలిపారు. నిందితులలో మొదటి వ్యక్తి ఒక గంజాయి, మూడు దొంగతనాలు, రెండు హత్య ప్రయత్నం నేరాలు, రెండవ నిందితుడు పై ఒక గంజాయి , దొంగతనం కేసు, మూడవ నిందితుడు పై సైతం ఒక కేసు కలదని తెలిపారు. ఈ కేసు పరిశోధనలో చురుకుగా వ్యవహరించిన అధికారులకు ఉన్నతాధికారుల అభినందనలు తెలియజేశారు.

# సమస్యలు పరిష్కరించకుంటే ఇంటి పన్నును బహిష్కరిస్తాం



**కోదాడ/నడిగూడెం, ఫిబ్రవరి 22 (నినాదం న్యూస్):** నడిగూడెం మండలం వేణుగోపాలపురం గ్రామంలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు శనివారం ఎంపీడీవో సంజీవ్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. గత ఐదు నెలలుగా గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదని పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. గ్రామంలో సమస్యలు తిష్ట వేస్తున్నా గ్రామ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఇంటి పన్నును బహిష్కరిస్తామని వివరించారు. రెండు రోజుల్లో గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. రేఖ వంశీ, నేసిన సురేష్, రసికేశ్, సిద్దు, బోసు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలలో బస చేసిన కలెక్టర్



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి,ఫిబ్రవరి22(నినాదం న్యూస్):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం మొగఢ్ ధగఢ్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం రాత్రి జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే బస చేశారు. పాఠశాలను ఆకస్మికంగా సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్టు అధికారి దత్తురామ్ తో కలిసి సందర్శించారు. విద్యార్థుల స్టడీ అవర్స్ కొనసాగుతుండడాన్ని గమనించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన, వసతి సదుపాయాలు, విద్యా బోధన, రోజువారీ దినచర్య, మెనూ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టడీ అవర్స్ కొనసాగుతున్న గదులను సందర్శించి విద్యార్థులతో కలెక్టర్ భేటీ అయ్యారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పరంగా వారికి అందించిన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, ఇతర వసతులను పరిశీలించారు. అన్ని తరగతి గదులను, డార్మెటరీ, కిచెన్, డైనింగ్ హాల్ తదితర వాటిని సందర్శించి అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. స్టోర్ రూమ్ లో నిలువ ఉంచిన సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి పాఠశాలలోనే కలెక్టర్ నిద్రించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పలత, పాఠశాల సిబ్బంది, సంబంధిత అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్ హోటళ్ళపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 22(నినాదం న్యూస్):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రె ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ పట్టణంలోని పలు హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. స్థానిక కాకతీయ, శ్రీసాయి హోటల్, మైఫిల్ హోటళ్లలో తణిఖీలు చేశారు. మైఫిల్ హోటళ్లో నిలువ ఉంచిన మాంసం, చికెన్, పలు తినుబండారాలు బయటపడటంతో హోటల్ యజమానికి అధికారులు నోటీసులు జారీ చేశారు.

# యాదాద్రి భువనగిరి జిల్లాలో మొదటి బర్డ్‌ఫ్లూ వ్యాధి నిర్ధారణ





**చౌటుప్పల్, ఫిబ్రవరి 22 (నినాదంన్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లాలో మొదటి బర్డ్‌ఫ్లూ వ్యాధి నిర్ధారణ జరిగినట్లు జిల్లా పశు వైద్యాధికారి జానయ్య తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలో గత పది రోజులు క్రితం కోళ్లు మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన కోళ్లను హైదరాబాదులో ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించగా బర్డ్‌ఫ్లూ వ్యాదిగా నిర్ధారణ జరిగిందన్నారు. లోకల్ కోళ్లు ,బాయిలర్ కోళ్లు ఈ ప్రాంతంలో చాలా తక్కువగా ఉన్నాయని, కిలోమీటర్ పరిధిలోని కోళ్లన్నిటిని చంపడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ ప్రాంతం పరిధిలోని పది కిలోమీటర్ల మేర సర్వలేన్ జోన్‌గా ప్రకటించడం జరిగిందన్నారు.కిలోమీటర్ల పరిధిలోని కోళ్లన్నిటిని పరీక్షించి సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్ పంపించనున్నట్లు తెలిపారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ , కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో మొదటి కేసు నేలపట్ల గ్రామంలో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ జరిగిందని, నేలపట్ల పరిధిలో మొత్తం కిలోమీటర్ పరిధిలో ఐదు బ్రాయిలర్ ఫామ్స్ ఉన్నాయని వాటిని కూడా హైదరాబాద్‌కు పరీక్షలకు పంపించడం జరిగిందన్నారు. చికెన్ , గుడ్లు తినడం వల్ల ఎవరికి ఎలాంటి హాని జరగదని, హెల్త్ ప్రాబ్లమ్స్ జరిగే అవకాశం ఉన్నందున సరిగా బాయిల్ చేస్తే ఎలాంటి ప్రమాదం ఉండదని తెలిపారు.

# ఫోన్ చోరీ... ఆపై ఫోన్‌పే ద్వారా 99వేల దొంగిలింత



**చౌటుప్పల్, ఫిబ్రవరి 22 (నినాదంన్యూస్):** ఓ వ్యక్తి నుండి ఫోన్ చోరికి గురి కావడమే కాకుండా ఫోన్‌లోని గూగూల్‌పే, ఫోన్‌పే ద్వారా 99వేలు ఆగంతకులు తస్కరించిన సంఘటన చౌటుప్పల్‌లో చోటు చేసుకుంది. ఈఘటనకు సంబందించి ఎస్సై యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం........మునుగోడుకు చెందిన వ్యాపారస్తుడు ఏలే లక్ష్మినారాయణ చౌటుప్పల్ బస్టాండ్ నుండి మునుగోడుకు వెళ్ళేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కాడు. అనంతరం జేబులు పరిశీలించగా మొబ్కెల్ ఫోన్ కనిపించలేదు. కంగారు పడిన లక్ష్మినారాయణ వెంటనే సమీపంలోని వ్యక్తుల ఫోన్‌ల నుండి తన ఫోన్‌కు కాల్ చేయడానికి ప్రయత్నించగా అది స్విచ్ ఆఫ్ చూపించింది. అనంతరం లక్ష్మినారాయణ మునుగోడులోని కెనరా బ్యాంకు శాఖను విచారించగా రూ. 30,000, రూ. 40,000, రూ. 29,000, మొత్తం రూ. 99,000, గూగూల్‌పే స్కాన్ ఉపయోగించి అతని ఖాతా నుండి బదిలీ చేసినట్లు తెలియడంతో వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. ఈమేరకు బాధితుడు చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి తన న్యాయం చేయాలని కోరారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# మాజీ సీఎం...మాజీ మంత్రి కారు కూతలు మానుకోవాలి

**- టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ బాధ్యులు బాస్కరా చారి**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** తెలుగుదేశం పార్టీ, పార్టీ జాతీయ అధ్యక్షులు, ఏపీ సీఎంపై బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ సీఎం కెసిఆర్, మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డిలు కారు కూతలు మానుకోవాలని మంథని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ బాధ్యులు అందే బాస్కరా చారి హితవు పలికారు. తెలుగుదేశం పార్టీ సెంటిమెంటును రగిలించి గతంలో జరిగిన ఎన్నికలలో 10 సంవత్సరాలు లబ్ధి పొందిన బీఆర్ఎస్ మళ్లీ అదే పందాలో వచ్చి లాభపడాలని చూడటం అత్యాశే అవుతుందన్నారు. గత పది సంవత్సరాల కాలంలో ప్రజలు పాలకుల వంకర బుద్ధి, ఎత్తుగడలు అన్ని గమనించారనేది అసెంబ్లీ ఎన్నికలలో నిర్ధారణ అయిందన్నారు. అహంకారపూరితమైన మాటలే మిమ్మల్ని మూలకు కూర్చోబెట్టాయని పార్లమెంటు ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీకి గుండు సున్నా ఇచ్చారని, ఆ ఓటమిలతో దిక్కుతోచని పరిస్థితులలో ఉన్న మీరు తెలుగుదేశం పార్టీని, నాయకులను కార్నర్ చేయడం వలన మీకు ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. తెలుగుదేశం పార్టీ తెలంగాణలో కార్యకర్తలతో నిండిన పార్టీ అని, తెలంగాణకు నిజమైన న్యాయం చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ మా నాయకుడు చంద్రబాబు అని అన్నారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి తెలుగుదేశం పార్టీ అని ప్రజలకు తెలుగుదేశం పార్టీ వల్ల ఎంత లబ్ది పొందామో తెలుసని రాబోయే రోజుల్లో చంద్రబాబును గెలిపించి చూపించి ఎన్నికల్లో సత్తా చాటుతామని అన్నారు. ప్రతి ఒక్క తెలుగుదేశం కార్యకర్త రెట్టింపు ఉత్సాహంతో రాజకీయంగా మీ అంతు చూస్తామని ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను భ్రష్టు పట్టించి అప్పుల రాష్ట్రంగా తయారు చేసిన మిమ్మల్ని ప్రజలు ఎలా నమ్ముతారని ఆయన ప్రశ్నించారు.

## పెండింగ్లో ఉన్న ఉపాధి పనులు పూర్తి చేయాలి



**కోదాడ/రూరల్, ఫిబ్రవరి 22 (నినాదం న్యూస్):** పెండింగ్ లో ఉన్న ఉపాధి హామీ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా డిఆర్డిఏ పిడి అప్పారావు అన్నారు. పట్టణ పరిధిలోని ఎంపీడీవో కార్యాలయంలో కోదాడ, అనంతగిరి, చిలుకూరు మండలాల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. పనులు అసంపూర్తిగా ఉండడానికి గల కారణాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేసి నివేదిక పంపాలని ఆదేశించారు. పశువుల కొట్టాలు, దాన ఇతర పనుల పెండింగ్ ఉండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవోలు రామచంద్ర రావు, హరిసింగ్ ,సుష్మ ఎంపీఓ పాండురంగన్న, ఏపీఏ టానియా తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి మహెూత్సవ కరపత్రాలు
## -ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



**చౌటుప్పల్, ఫిబ్రవరి 22 (నినాదంన్యూస్):** చౌటుప్పల్ పట్టణంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఈనెల 25 నుండి నిర్వహించే మహాశివరాత్రి మహెూత్సవానికి సంబందించిన కరపత్రాలను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు వుప్పల కృష్ణగుప్త, అశోక్‌కుమార్ గుప్త పాల్గొన్నారు.

## నేడు అన్నదాన కార్యక్రమం



**కోదాడ, ఫిబ్రవరి 22 (నినాదం న్యూస్):** కోదాడ పట్టణంలోని శ్రీరంగాపురం గ్రామంలో నేడు జరగబోయే ఆంజనేయస్వామి ఆలయ 22వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా కోదాడ మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నం బాబు, ఆంజనేయస్వామి దేవాలయ ఛైర్మన్ కుర్రి గోపయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ అన్నదాన కార్యక్రమానికి భక్తులు తరలి రావలసిందిగా దేవాలయ నిర్వహకులు కోరారు.

# నిజామాబాద్ పసుపు యార్డు సందర్శన

**నిజామాబాద్,ఫి బ్రవరి22(నినాదం న్యూస్):** నిజామాబాద్ పసుపు యార్డు ఎమ్మెల్సీ కవిత సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. నిజామాబాద్ పసుపు యార్డులో.. రైతులు దారుణంగా మోసపోతున్నారని, వారం రోజులుగా ధరలు పడిపోయాయన్నారు. కేంద్రం 15 వేలు మద్దతు ధర ఇస్తామని గొప్పలు చెప్పి రైతులను మోసం చేశారని, పసుపు బోర్డు కు చట్ట బద్దత లేదన్నారు ఎమ్మెల్సీ కవిత. పార్లమెంట్ లో బిల్లు పెట్టీ .. బిల్లు పాస్ చేస్తే రైతులకు మేలు జరుగుతుందని, పసుపు మార్కెట్ లో రైతులను బ్లాక్ మెయిల్ చేసే పరిస్థితి అని ఆమె మండిపడ్డారు. ప్రభుత్వం పట్టించుకోక పోవడం వల్లే ఈ పరిస్థితి అని, పసుపు కు 12 వేలు ఇస్తామని గతంలో సీఎం రేవంత్ చెప్పారన్నారు. పసుపు రైతులకు బోనస్ ఇవ్వాలని, కేంద్రం పై పసుపు 15 వేలు ధర ఇవ్వాలని పోరాటం ఉంటుందన్నారు.